# పొగమంచు

జనవరి నెల. వాతావరణం బాగా చల్లగా ఉంది. తెల్లారిపోయినా ప్రపంచాన్ని కప్పిన పొగమంచు ఇంకా విడిపోలేదు. విమానాశ్రయంలో కాలు కాలిన పిల్లిలాగా అటూ ఇటూ నడుస్తోంది వర్ధనమ్మ. దాచా-లని ఎంత ప్రయత్నించినా చిరునవ్వు దాచుకోలేకపోతున్నారు ఆవిడ. అవును మరి! అయిదు సంవత్సరాల తర్వాత ఆమె కొడుకు విదేశం నుంచి వస్తున్నాడు. ఆ ఆనందం, సంతృప్తి ఆమె మొహంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పొగమంచు కారణంగా విమానం దిగలేక విమానాశ్రయం చుట్టూ తిరుగుతున్నదని అనౌన్స్‌మెంట్ వచ్చింది. పైన తిరుగుతున్న విమానం కన్నా వేగంగా తిరుగుతున్నాయి వర్ధనమ్మగారి ఆలోచనలు.

బాబు పుట్టినప్పటి నుంచి వాడిని బాగా చదివించాలనీ, అమెరి-కాకు పంపాలనీ అనుకున్నారావిడ. ఆవిడ స్నేహితురాలు వెళ్ళయాక అమెరికా వెళ్ళి అక్కడ జీవితం గురించి రాసిన ఉత్తరాలు, ఇక్కడికి వచ్చినప్పుడు చెప్పిన మాటలూ, తెచ్చిన వస్తువులూ ఈ ఆలోచనను మరింత పెంచాయి. ఇంజనీరింగ్ చదివించి పై చదువులకు అమె-రికాకు పంపాలనే దృష్టితో దొరబిడ్డలా పెంచింది కొడుకుని. వాడిని అమ్మా అని కూడ పిలవనివ్వలేదు ఆమె. మాటలు వచ్చీరాని రోజు-లనుంచే మమ్మీ అనే పిలుపు నేర్పింది. ఆ రోజు ఆమెకు బాగా గుర్తుంది. అప్పుడు బాబుకి మూడో ఏడు. ఇంటి పనులు పూర్తి చేసుకుని మంచంమీద నడుం వాల్చింది. అంతే గుమ్మం దగ్గర ఆడు-కుంటున్న బాబు "అత్తా! అత్తా! అత్తొచ్చింది" అని కేకలు వేసుకుంటూ పరుగెత్తుకొచ్చాడు. ఆమె మొహం ఎర్రగా కందిపోయింది.

"ఎన్నిసార్లు చెప్పాలిరా నీకు ఆంటీ అని పిలవమని?" కోపంగా నాలుగు వేసింది వాడి వీపుమీద. బిక్కమొహం వేసుకుని నిలబడిపోయింది ఆవిడ ఆడబిడ్డ. ఒదినా మరదళ్ళిద్దరూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ

కూర్చున్నారు. మళ్ళీ వాడు మమ్మీ ... కాక్కు ... కాక్కు ... ఆమె ముఖం మళ్ళీ ఎర్రబడింది. ఆసారి ఆమె ఆడబిడ్డ అడ్డుపడింది కనుక దెబ్బలు తగలలేదు బాబుకి.

టాయిలెట్‌కి వెళ్ళాలని చెప్పమని ఎన్నిసార్లు నేర్పించినా వీడు ఇంతే ఆమె విసుక్కుంటూ లేచింది.

అత్తగారెంత మొత్తుకున్నా చేత వెన్నముద్దగానీ మా తెలుగుతల్లికీ మల్లెపూదండ గాని నేర్పనివ్వలేదు ఆవిడ. మూడుమైళ్ళ దూరంలో ఉన్న ఇంగ్లీషు మీడియం బడిలో చేర్పించింది బాబుని. రెండో భాషగా కూడా తెలుగు నేర్చుకోనివ్వలేదు, ఫ్రెంచ్ నేర్పించింది. పొరపాటున కూడా తెలుగు సినిమా చూడనివ్వలేదు. కబడ్డీ ఆడాలన్నా, ఫుట్‌బాల్ ఆడాలన్నా వాడికెంతో ఇష్టం వుండేదిగాని ఆవిడ పడనివ్వలేదు. క్రికెట్ గాని టెన్నిస్‌గాని ఆడమని పట్టుపట్టింది. ఇంజనీరింగ్ పాసయ్యాడు బాబు. అమెరికాకు పై చదువుకు వెళ్ళి అక్కడే ఉద్యోగం సంపాదించుకున్నాడు. అయిదు సంవత్సరాల తర్వాత వస్తున్నాడు. ఓ మంచి పిల్లని చూసివాడికి పెళ్ళి చేసేస్తే తన బాధ్యత తీరిపోతుందని ఆమె అనుకుంది. పక్కనే ఉన్న మేనకోడలివైపు చూసిందామె. కుందనపు బొమ్మలా వుంది. వాడికి ఈడూ జోడూ సరిపోతుందనుకుంది.

"మమ్మీ" ఎదుట నిలుచున్న కొడుకుని చూసి ఉక్కిరిబిక్కిరి అయిపోయింది వర్ధనమ్మ. ఎంత ఎదిగిపోయాడు వాడు! అచ్చం దొరబాబులాగే ఉన్నాడు. "పద మమ్మీ పోదాం" అతి కష్టంమీద తెలుగులో పలికాడు. అతను నడిచాడు.

ఎయిర్‌పోర్టునుంచి రోడ్డుమీదకు దిగే మెట్ల దగ్గర ఓ నిముషం ఆగాడు అతను. "మమ్మీ మర్చిపోయాను. ఈమె నీ కోడలు" వెనుకవస్తున్న దొరసానిని పరిచయం చేశాడు.

వర్ధనమ్మ కళ్ళు తిరిగిపోయాయి. హైహీల్స్‌షూస్, ఫ్రాక్, విరబోసుకున్న తెల్ల జుత్తు ఆ అమ్మాయి తన కోడలా? కళ్ళు పక్కకు

తీసేసుకున్నారావిడ. పక్కనే తెలుగుతనం ఉట్టిపడిపోతూ కుందనపు బొమ్మలా ఉన్న మేనకోడలూ!

"ఏమిటిరా!" కోపం ఆపుకోలేకపోయింది ఆవిడ. "మనదేశంలో ఆడపిల్లలే లేనట్లు ఏంటిరా ఈపని?"

మనదేశంలో ఆడపిల్లలు నాకెలా పనికొస్తారు మమ్మీ? నేను ఈ ఊళ్ళో పుట్టినా అమెరికాలో పుట్టినట్లు పెరిగాను కదా మమ్మీ. అయినా విదేశీభాష నేర్చుకున్నప్పుడు లేని బాధ ఇప్పుడెందుకు మమ్మీ!

వర్ధనమ్మ నోట మాటరాలేదు. పొగమంచులో చిక్కుకుపోయి వెలుతురు అందించలేక పోయినందుకు సిగ్గుపడుతున్న సూర్యుడు మెల మెల్లగా మబ్బుల మెట్లు దిగాడు.

* * *

(ఉదయం వారపత్రిక 23-3-90 సంచికలో ప్రచురితం)